# నాకు నచ్చిన నా కథ



కె. రవీంద్రబాబు

పదిహేను రోజులలో 20 కథలు వ్రాసాను. ఆ సమయంలో వ్రాసిన కథ పరకాయ ప్రవేశం. అదికూడా శ్రీ బూరు గుల గోపాలకృష్ణమూర్తిగారు "మీరు మంచి వర్ణనలతో అద్భుత కథా సంవిధానంతో ఒక కథ వ్రాయండి" అని అడిగిన వెంటనే వ్రాసిన కథ। ఆయన చెప్పిన విధంగా వెంటనే వ్రాసి ఆంధ్ర పత్రికకు పంపితే వారు వేసుకున్నారు. తర్వాత ఎన్నో కథలు వ్రాసినా యీ కథ వ్రాసినప్పుడు కలిగిన అనుభూతి మరలా కలుగలేదు.

## పరకాయ ప్రవేశం

ఆదివారం సాయంత్రం యశోపాలగారి మేడలో చేరాము. మేడ ఊరిబయట ప్రశాంతత రాజ్యం చేస్తున్న వాతావరణంలో, ఆహ్లాదకరమైన పరిసరాలలో ఉంది. తామర పూలతో నిండిన కొలను ఒకపక్క, పచ్చటి పంటచేలు ఒక పక్క, రాబోయే వసంతకాలానికి స్వాగతం చెప్పటానికి సిద్ధమవుతున్న

చిగురు మామిడితోట ఒకపక్క- మధ్యలో అధునాతనమైన అన్ని హంగులు అమర్చబడిన పాతకాలం మేడ 'సుధర్మ'. పని లేనపుడు, మనసు చికాకుగా ఉన్నప్పుడూ పట్టణంలో ఉన్న కవి, రచయిత, తదితర కళాకారులు 'సుధర్మ'కు దారితీయటం అలవాటు. అక్కడ వాతావరణంలో సేదతీర్చుకొని, యశోపాలగారి ఎల్లని ఆతిథ్యంతో బాధలు మరచిపోయి ద్విగుణీకృతోత్సాహంతో తిరిగి రావటం మా కలవాటు.

యశోపాలగారు స్వయంగా కవి, పండితుడు. మీదుమిక్కిలి విశేష వ్యక్తిత్వంగల మనిషి. ఈ రోజుల్లో బిరుదులకు, సన్మానాలకు, సత్కారాలకూ దూరంగా ఉండే ఆయనలాటివారు బహు కొద్దిమంది కనిపిస్తారు. పిత్రార్జితం ఆయన్ను ఆర్థిక అవసరాల బాధనుండి తప్పిస్తే, నిరాడంబర, నిగర్వ మనస్తత్వం ఆయన్ను ముఖప్రీతిపరుల బాధనుండి తప్పించింది. అదేమి విచిత్రమో కాని, బయట విశేషంగా వ్యక్తిపూజలు, దూషణలూ చేసే వ్యక్తులు కూడా ఆయన ఎదురుగా నోరు విప్పరు. కుల, మత, వర్గ, రాజకీయ, ప్రాంతీయభేదాల కతీతంగా ఉండే ఆయనవద్ద సంకుచిత స్వభావం వెలిబుచ్చటానికి ఎవరికీ ధైర్యం చాలేదికాదు.

కొన్ని ప్రత్యేక సందర్భాలలో యశోపాలగారు స్వయంగా ఊరులోని కవి, పండిత, గాయక కళాకారులను ఏరి, తన ఇంటికి ఆహ్వానించి విందు లిస్తూ ఉండేవారు. ఆహ్వానింపబడ్డవారు పెద్ద సన్మానానికి ఆహ్వానం వచ్చినట్లు సంతోషంగా వెళ్ళేవారు. కవులలో కవి, పండితులలో పండితుడు, రచయితలలో రచయిత, గాయకులలో గాయకుడు అయిన యశోపాలగారి ఆతిథ్యం పొందిన వ్యక్తి రసానందంతో తన్మయత్వం చెందేవాడు.

ఆ రోజు ఎందుకనో అందరూ కవులూ, పండితులే వచ్చారు విందుకు. రాజన్ అనే డి.వై.ఎస్.పి. చిత్రలేఖనంలో సిద్ధహస్తుడు కూడా ఉన్నాడు. అందరం మాట్లాడుకుంటూ కాలక్షేపం చేశాము.

పెందలాడే భోజనాలు వడ్డించారు. భోజనాలు ముగించి హాలులోకి వచ్చి చేరామో, లేదో వాతావరణంలో ఆకస్మికంగా మార్పు కనిపించింది. చల్లటి వెలుగు కొద్దిపాటి వెన్నెలను ప్రసాదిస్తూ వచ్చిన చతుర్దశి చంద్రుడు కాలమేఘాలు కప్పబడి కనబడకుండా పోయాడు. తిమింగిలాల గుంపు యుద్ధం చేస్తున్నట్లు

తటగోల ధ్వనులతో ఆకాశం మేఘాలతో నిండిపోయింది. సముద్రం మధ్యలో బడబాగ్ని వెలుగుల్లా మెరుపులు మెరుస్తున్నాయి. ఇంతలో హోరుమని ఈదురు గాలి బయలుదేరింది. పాత మేడను ఒక వూపు వూపిన గాలికి తెరిచివున్న కిటికీలు, తలుపులూ పెద్ద శబ్దంతో కొట్టుకోటంతో, నడి సముద్రంలో తుపానుకు వూగిలాడుతున్న నావలో కూర్చున్నట్లు ఫీలయాము. కిటికీలు, తలుపులూ మూసిన తర్వాత ఠపా ఠపామనే శబ్దం ఆగిపోయింది కాని స్వల్పంగా కంపిస్తున్న మేడ తిమింగలం దెబ్బకు కంపిస్తున్న నావలా ఉంది. ప్రచండ పవన వేగానికి వంగుతూ, లేస్తూ హైరానా పడుతున్న చెట్లు ప్రళయ కాలంలో నృత్యంచేసే భూతగణాల్లా ఉన్నాయి. అప్పుడు ఒక్కసారి గాలి ఆగిపోయి పెద్ద పెద్ద చినుకులతో ప్రారంభమై కుంభవృష్టిగా మారింది, ఆకాశాన్ని భూమిని ఏకంచేస్తూ జలస్తంభాలా అనే భ్రాంతి కలిగించసాగాయి.

పెనుగాలికి విపరీతంగా చలించిపోయిన ప్రకృతి — వాన రావటంతో ప్రశాంత పడటం విలావిలా కొట్టుకుంటూవున్న మూర్ఛరోగిపైన నీళ్ళు పోయగానే శాంతించినట్లయింది. కుంభవృష్టిగా దాదాపు గంటసేపు కురిశాక ఉధృతం తగ్గి, మంద్రస్థాయిలో కురవటం రేసులో పందెం గుర్రం పందెం అయినాక కూడా ఆ వూపులో కొంతదూరం పరుగెత్తుకు వెళ్ళినట్లుంది. హోరు గాలికి వర్షానికి అదరిపోయిన నరాలూ, చెదరిపోయిన మనసూ కుదటపడి ప్రాణాలకు స్వాస్థ్యం చిక్కింది.

వేడి వేడి టీ తెచ్చి ఇచ్చారు. చలికి ముడుచుకుపోయిన శరీరాల్లోకి మళ్ళీ కొంచెం వేడి పుట్టుకువచ్చింది. బయట ప్రకృతి హడావిడ చేస్తున్నంతసేపు నిశ్శబ్దంగా ఉన్న మేము — వాతావరణం నిశ్శబ్దం అవగానే సందడి మొదలెట్టాము.

ఏదైనా కథ చెప్పమన్నారు కొందరు. కాదు నిజ జీవితంలో వింత అనుభూతులను గురించి చెప్పమన్నారు కొందరు. జీవితంలో ఎక్కువగా కదిలించిన సంఘటనలు చెప్తే బాగుంటుందన్నా రింకొకరు. సువ్వంచే మ వ్వమకొన్నారు. చివరకు రూపాయి నాణెం పైకెగరేసి అది ఎవరిమీద పడితే వారు కథ చెప్పాలని నిర్ణయించారు. యశోపాలగారు రూపాయి పైకి విసిరారు, సీలింగుకు కొట్టుకొని తిరిగివచ్చి రాజన్ మీద పడింది.

హాల్లో వాతావరణం నిశ్శబ్దం అయిపోయింది. ఒక్కసారి రాజన్ ఏం చెబుతాడో విందామన్న ఉత్కంఠతతో అందరూ చెవులు రిక్కించి వింటున్నాం. నెమ్మదిగా సోఫాలో సర్దుకుని కూర్చొని మొదలెట్టాడు రాజన్.

“నేను రచయితను కాను. పెద్దగా కథలు చదవలేదు. అందువలన కథ చెప్పలేను, కల్పించలేనుకూడా. వాస్తవం కల్పన కంటె ఆసక్తిదాయకంగా ఉండొచ్చు ఒక్కోసారి. నేను చెప్పబోయేది నిజంగా జరిగింది. కాకపోతే పేర్లు, ప్రదేశాలు మాత్రం నిజం కాదు. పైగా నేను చెప్పబోయే విషయం నన్నెక్కువగా కదిలించింది. మా వూళ్ళో రాజగోపాలం అని నగల వర్తకుడుండేవాడు. రత్నాలను పరీక్షించటంలో మంచి నిపుణుడు. ఆయనకు ఎందుకనో అన్ని రాళ్ళలోకి వైడూర్యం అంటే ఎక్కువ ఇష్టం. ఆయన లక్కీ స్టోన్ కూడా వైడూర్యమే కావచ్చు.

పెళ్ళి అయిన పదేళ్ళకు ఆయన భార్య మధురం ప్రసవించి కవల పిల్లలను కన్నది. ఇద్దరూ మగపిల్లలే! చూడటానికి ఇద్దరూ రూప ప్రతి రూపాల్లా ఉన్నారు. కాకపోతే పెద్ద ఎవరో, చిన్న ఎవరో గుర్తుపెట్టుకోటానికా అన్నట్లు ఇరవై నిమిషాల ముందు పుట్టిన బిడ్డ ఎర్రగా ముట్టుకుంటే కందిపోయేట్లు ఉన్నాడు. తమ్ముడు నల్లగా కస్తూరి కలపని కాటుక రంగులో ఉన్నాడు.

పెద్దబిడ్డ పేరు విష్ణువైడూర్యం అనీ, చిన్నబిడ్డ పేరు కృష్ణ వైడూర్యం అనీ పెట్టాడు రాజగోపాలం. వైడూర్యాలలో తెల్లని మచ్చ ఉంటే విష్ణువైడూర్యం అని, నల్లగా ఉంటే కృష్ణవైడూర్యం అనీ అంటారు.

విష్ణునూ, కృష్ణనూ అపురూపంగా పెంచసాగారు దంపతులు. తల్లితండ్రి సమదృష్టితో చూసినా, చూసేవాళ్ళకు విష్ణు ముద్దొచ్చేవాడు. కృష్ణను ఎవరూ అట్టే పలకరించేవారు కారు. శరీర ఛాయలోని భేదం ఇద్దరి ప్రవృత్తులలోనూ, గుణ గణాలలోనూ, నడవడిలోనూ అంత మార్పు కలిగించగలదని పుట్టినప్పుడు బహుశః తల్లితండ్రులు వూహించి ఉండలేదేమో!

విష్ణు మొదటినుండి చలాకీగా, చురుకుగాను, హుంషారుగాను, అంతులేని ఆత్మవిశ్వాసంతో ఉండేవాడు. చూపరులను వెంటనే ఆకర్షించే రూపంవల్ల అందరూ ఉంటే ఇలాంటి కుర్రవాడుండాలి అనుకునేట్లు ఉండేవాడు కానీ పరీక్షగా చూసినవారికి, దగ్గర ఉన్నవారికి, బంధువులకు, నౌకర్లకూ గారాబం

అనే పాలుపోసి పెంచిన నాగుపాములాంటి స్వార్థగుణం, అపేక్ష ఎక్కువ అయినందువలన పెరిగిపోతున్న మకురుగుణం.. శ్రద్ధ ఎక్కువ అయినందువలన పెరిగిపోయిన స్వార్థం కనిపించేవి

అందుకు భిన్నంగా కృష్ణ మొదటినుండి అశ్రద్ధకు, అలసత్వానికి అలవాటు పడిపోయి ఉండటం వలన విదానంగా, వింపాతిగా ఎప్పుడూ ఆత్మావలోకనలలో మునిగిపోయిన విరాగిలా కనిపించేవాడు. చూడగానే ఆకర్షించలేకపోయినా, దగ్గరవారికి అతనిలోని ఆత్మసౌందర్యం, ఆత్మావలోకనం చేసుకోగల ఆలోచనా శక్తి, మంచి చెడు గ్రహించగల పరిశీలనా శక్తి, కష్టం సుఖం గమనించ కలిగిన నేర్పరితనం, పరిస్థితిని బేరీజు వేసుకోగల సంయమన శక్తి కనిపించేవి.

విష్ణు పెద్దగా గురించి పట్టించుకోకపోయినా కృష్ణ ఎప్పుడూ అన్నదగ్గరే తేగాలు ఉండాలని కోరుకునేవాడు. ఇద్దరిలో మరో పెద్ద వ్యత్యాసం కొట్టవచ్చినట్లు కనిపించేది. అన్న భయస్థుడు. తమ్ముడికి విపరీతమైన ధైర్యం. అన్న ఎప్పుడు సినిమాలనీ, షికారులనీ తిరుగుతూండేవాడు తమ్ముడు ఎప్పుడూ చదువుకుంటూనో, ఆలోచించుకుంటూనో కాలం గడిపేవాడు.

రాజగోపాలం చెల్లి కూతురు మంజూహాస విష్ణు, కృష్ణల కన్నా రెండేళ్ళు చిన్నది. మంజు పుట్టగానే తల్లి తండ్రి, అత్త మామ కూడా విష్ణుకు భార్య పుట్టిందన్నారు. మంజు వయసుతో పెరుగుతూ అందాలను సంతరించుకొంటున్న కొద్దీ విష్ణుతో సాన్నిహిత్యం ఎక్కువ అవుతూ వచ్చింది. అన్నింటా వ్యతిరేక స్వభావమైన అన్నాతమ్ముల్లది మంజును ప్రేమించటంలో మటుకు కృష్ణకు అన్నపోలిక వచ్చింది. అన్నకు నిర్దేశించబడిన పిల్ల అవటం వలన, పరస్పరం మంజు, విష్ణు ప్రేమించుకుంటూ ఉండటంవలన కృష్ణ ప్రేమ వ్యక్తంచేసుకోవ టానికి వీలులేక హృదయాంతర్గతగానే ఉండిపోయింది. ఎంత కష్టపడ్డా మంజును హృదయంనుండి తొలగించుకోలేకపోయాడు కృష్ణ.

తననూ తన ఇంటికి వస్తూవుండే మంజు తన ముఖం చూడకపోయినా కూడా కృష్ణ కళ్ళు ఆమె ఎటు వెళ్తే అటు చూస్తూ ఉండిపోయేవి. ఎప్పుడయినా మంజు పలకరిస్తే కృష్ణ హృదయం ఆనందంతో పరవళ్ళు తొక్కేది. కొద్దిసేపు ఆమె సాన్నిధ్యంలో గడిపే అవకాశం వచ్చినప్పుడు మనసు పరవశంతో పండుగ

చేసికొనేది. మంజు గుర్తుకువస్తేనే చాలు కృష్ణ హృదయం నాట్యంచేసేది ఆనందంతో ముఖంపై అపూర్వము, అలౌకికము అయిన వెలుగు కనబడేది.... కాని, కృష్ణ హృదయం అనితకి తప్ప మరెవరికి అర్థంకాదు కదా!


క్రమంగా పెద్దవారు అవుతున్న కొద్దీ అన్నదమ్ముల ప్రవృత్తిలో కొట్టవచ్చినట్లు తేడాలు కనిపించసాగాయి. విష్ణు తన మాట ఎప్పుడూ చెల్లుతూ ఉండటంతో చెడు సావాసాలు, చెడు అలవాట్లు కొన్ని అబ్బాయి. స్వతహాగా సూక్ష్మగ్రాహి, తెలివిగలవాడు గనుక చదువులో మాత్రం ఎప్పుడూ మొదటి రాంకులోనే ఉండేవాడు విష్ణు. అందువలన తండ్రి రాజగోపాలం మొదట్లో ఏమీ అనకపోయినా, తర్వాత క్రమశిక్షణ లేకుండా విచ్చలవిడిగా తిరిగితే చెడిపోతా డనే భయంతో కట్టడిచేయటం మొదలుపెట్టాడు. తనను బయటకు వెళ్ళనివ్వరని గ్రహించి తర్వాత విష్ణుకు చక్కటి మార్గం తోచింది. తమ్ముడు కృష్ణ ఎప్పుడూ ఇల్లువదలి వెళ్ళడు. ఎప్పుడూ తన గదిలోనే ఉంటాడు. నిజానికి కృష్ణ గదిలో ఉన్నాడో, లేడో ఎవరూ చూడరు. ఇద్దరిదీ ఒకే ఆకారం, ఒకే దుస్తులు, ఒకే విధమైన నడక, మనసులు. రంగు మాత్రమే భేదం.

ఒక రోజు స్నేహితులతో కలిసి సినిమా విడుదలైన మొదటిరోజే ఆటకు వెళ్ళాలని అనుకున్నాడు విష్ణు. తండ్రికి తెలిస్తే వెళ్ళనివ్వడు. పైగా మధ్య మధ్య రూముకు వచ్చి చూస్తున్నాడు కూడా.

తమ్ముడు కృష్ణ చేతులకు ముఖానికి క్విక్ ఫేర్ అండ్ లవ్‌లీ పూసి అద్దం ముందు తనపక్కన కూర్చోబెట్టుకున్నారు. కొద్ది సెకన్లసేపు తనెవరో, కృష్ణ ఎవరో తెలిసికోలేనంతగా తబ్బిబ్బుపడ్డాడు.

తను సినిమాకు వెళ్ళి వచ్చినంతసేపూ కృష్ణను తన గదిలో ఉండమని కోరాడు విష్ణు. విష్ణు అడిగితే కాదనలేక ఒప్పుకున్నాడు కృష్ణ. విష్ణు వేషంతో మూడుగంటలూ అతని గదిలో గడిపి విష్ణు దొడ్డివాకిలిగుండా పెరటిమెట్లగుండా పైకి వచ్చాక, బాత్‌రూమ్‌లో క్విక్ ఫేర్‌అండ్‌లవ్‌లీ కడిగేసుకొని వచ్చి తన రూములో పడుకున్నాడు కృష్ణ. ఆపరేషన్ పరకాయ ప్రవేశం ఇంత తేలికగా జరుగగలదని తెలిసికొన్నాక విష్ణు తన ఇంట్లోంచి తెలియకుండా వెళ్ళాలను కొన్నప్పుడల్లా ఇదే పద్ధతి అవలంబించేవాడు.

ఇంకోసారి ఎవరయినా బయటవాళ్ళిచ్చిన రిపోర్టు వలన అనుమానం




వచ్చి, రాముకు వచ్చిన తండ్రి కూడా విస్సు వేషంలో వున్న కృష్ణను విష్ణు అనే అనుకుని క్రమంగా బయటివాళ్ళు ఇచ్చే ఫిర్యాదులను నమ్మటం మానేశాడు.

ఇలా ఇద్దరు ఇంటర్ పాసయ్యారు. ఫస్ట్‌క్లాస్‌లో మంచి మార్కులు వచ్చాయి ఇద్దరికీ. ఇద్దర్నీ బి.ఎస్.సి.లో మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో చేర్పించాడు తండ్రి. మాంబళంలో ఒక ఇల్లు అద్దెకు తీసుకుని, నాయర్‌తో వంట చేయించుకు తినే ఏర్పాటు చేశాడు. చదువులోనూ, ఇతర కార్యక్రమాలలోనూ కూడా ఇంటిపట్ల ఉన్నట్లుగానే వుండే విస్సు, చదువులో ఫస్టువస్తూన్నా జల్సాలు, స్నేహాలు, షికార్లు, పార్టీలు, సినిమాలు ఎక్కువ చేశాడు మునుపటికంటే. కృష్ణ చదువులో ఫస్టే కాని రాము వదలి వెళ్ళేవాడు కాదు.

కాకపోతే వయసుతో పాటే స్నేహితులు, అభిరుచులు, అలవాట్లు మారాయి విష్ణుకు. విందులూ, వినోదాలే కాకుండా అడపాదడపా మందుపార్టీలు, ఆడపిల్లల స్నేహాలు కూడా పెరిగాయి.

మొదట్లో సూచనగా అన్నను మందలించబోయాడు కృష్ణ. ఆడది తిరిగి చెడుతుందని, మగవాడు తిరగక చెడతాడని- అందువలన తన్ను గురించి ఏమీ భయపడవద్దని చెప్పాడు విష్ణు. మరి మంజు మాట ఏమిటని కృష్ణ అడిగితే ఎవరయినా ఎప్పుడో ఆర్టీలోనో, పార్టీలోనో కొద్ది క్షణాలు తనకు దగ్గరయినంత

మాత్రాన మంజు తన హృదయంలోంచి దూరం కాదనీ, యవ్వనోద్రేకంలో లెక్క చేయనవసరం లేదనీ చెప్పేవాడు.

"ఎప్పుడూ ఇంట్లోనే ఉంటే మొక్క మొలిచిపోతావు. నాతో కూడా వచ్చి హుషారుగా ఉండు" అంటూ సలహా కూడా ఇచ్చాడు విష్ణు. తమ్ముడు బదులు చెప్పకపోవడంతో 'సరే నీ కర్మ' అంటూ వెళ్ళిపోయాడు విష్ణు టికిలా పార్టీకి.

మద్రాసులో నగరంలోని ధనవంతుల అబ్బాయిలు అప్పుడప్పుడు ఏదైనా హోటల్ రూముల్లో కాని, గెస్ట్ హౌస్‌లలో కాని ఏర్పాట్లు చేసుకుంటూ ఉంటారు టికిలా పార్టీలు

ఫారిన్ లిక్కరూ, గర్ల్ ఫ్రెండ్సూ, ధారాపాతంగా డబ్బూ ఖుషీ చేసుకోవాలని సరదాపడే యువకులూ ఉంటే టికిలా పార్టీలకు కొదవలేదు.

కావలసినవారికి కావలసినంత ఫారిన్ లిక్కర్, రికార్డ్ ప్లేయర్‌లోంచి వచ్చే విదేశీ సంగీతానికి అనుగుణంగా డాన్స్ భాగస్వామినితో డాన్స్ చేస్తారు. అబ్బాయి నుదురుకు, అమ్మాయి నుదురుకు మధ్య బెలూన్ ఉంటుంది. డాన్స్ మధ్యలో ఎప్పుడు బెలూన్ పగిలితే అప్పుడా జంట వో గదిలోకి తప్పుకుంటారు.

అమ్మాయి నచ్చకపోతే జాగ్రత్తగా వళ్ళు దగ్గర పెట్టుకుని బెలూన్ పగలకుండా రికార్డు అయేవరకూ డాన్స్ చేస్తే విరామ సమయంలో పార్ట్‌నర్‌ను మార్చుకోవచ్చు. అదృష్టం కలిసి వచ్చింది. డాన్స్ పార్ట్‌నర్‌గా ఆంగ్లో ఇండియన్ గర్ల్ మేరీ దొరికింది. తరచుగా మేరీతోనే జత కుదురుతుంది విష్ణుకు. అలాంటప్పుడు మంజు, కృష్ణ క్షణకాలం గుర్తువస్తారు. మరుక్షణంలో మ్యూజిక్ మోతలో, డాన్స్ చేయటంతో అన్నీ మరచిపోతారు. ఇటువంటి పార్టీలలో పార్ట్‌నర్‌ను ఎప్పుడూ మారుస్తూ ఉంటే ఏ చిక్కూ లేదు. ఒకే అమ్మాయిని ఎక్కువ సార్లు పార్ట్‌నర్‌గా తీసుకుంటుంటే సాన్నిహిత్యం ఏర్పడే ప్రమాదం ఉంటుంది. మేరీతో ఆ ప్రమాదం ఏర్పడుతుందేమో అనే భయం లీలగా విష్ణు మనసులో తళుక్కుమని మాయమయింది.

ఎక్కువసేపు డాన్స్ చేయకుండానే బెలూన్ పగిలింది. డాన్స్ చేస్తున్న గుంపునుండి విష్ణు, మేరీ అదృశ్యమయ్యారు.

• • •

కృష్ణకు మద్రాస్ వచ్చిన దగ్గరనుండి చిత్రలేఖనం మీద అభిమానం పెరిగింది. ఎక్కువగా ప్రకృతి దృశ్యాలను వాటర్ కలర్స్‌తోనూ, ఆయిల్ పెయింట్స్‌తోనూ చిత్రిస్తున్నాడు. చిత్రలేఖనం మీద అభిమానమున్న మిత్రులంతా ఎక్కడయినా సమావేశమై ఒకరి చిత్రాలొకరికి చూపించుకుని విమర్శనా పూర్వక ప్రశంసలు చేసుకోవటంలో మహదానందం పొందుతుండేవారు.

కృష్ణ పిచ్చిగీతలు విష్ణు కర్థమయేవి కావు. విష్ణు పిచ్చిగంతులు కృష్ణకు అర్థమయ్యేవి కావు. ఇష్టమయ్యేవి కావు.

సెలవులకు ఇంటికి వెళ్ళినపుడు విష్ణు, మంజు చెట్టాపట్టాలేసుకుని తిరిగేవారు. కృష్ణ హృదయాంతరాళంలో నిబిడీకృతమైన ప్రేమ అంతర్వాహినిగా శరీరమంతా ప్రవహించి పులకింప చేసేది మంజును చూడగానే.

ఎంత ప్రయత్నించినా మంజును హృదయపీఠం నుండి తొలగించ జేయలేకపోయాడు కృష్ణ. తగ్గించాలని ప్రయత్నం చేసినకొద్దీ ఎక్కువ అవ సాగింది మంజుపై ప్రేమ.

మద్రాసులో విలాస జీవనం గడిపివచ్చిన విష్ణు అంతా మరచిపోయి, మంజుతో అమాయక యువప్రేమికునిలా మసలుకునేవాడు. అదే ఆశ్చర్యం వేసేది కృష్ణకు.

మంజు కూడా విష్ణు అంటే ప్రాణం ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నట్లు ఉండేది. బావ కోసమే పుట్టాను, బావ నా వాడు అన్నట్లు ప్రవర్తించేది. పెద్దల ప్రోత్సాహం కూడా ఉండటంతో మంజు, విష్ణు సినిమాలకు, షికార్లకు వెళ్తుండే వారు. సెలవులు అయిపోయి మరలా మద్రాసు వెళ్ళాల్సిన సమయం వచ్చేసరికి మంజు మూడీగా అయిపోయేది. మళ్ళీ ఎన్ని నెలలకో గాని బావ కనిపించడు అని అనుకోవటానికే భయపడేది. నిమిషం కూడా విష్ణుని వదలిపెట్టకుండా నీడలా వెన్నంటి ఉండేది. ఇంటినుండి విష్ణు వెళ్ళిపోయే సమయంలో మటుకు ఎవరికీ కనిపించకుండా తన గదిలో ఉండిపోయి తలుపు గడియ పెట్టుకొనేది. బావ వెళ్ళటం చూడలేకపోయేదన్న మాట!

బి.ఎస్.సి. పరీక్షలయినాక అఖిల భారతస్థాయి పోటీ పరీక్షలలో పాసయిన విష్ణుకు పశ్చిమ జర్మనీ వెళ్ళటానికి అవకాశం వచ్చింది.

ప్రయాణం కొద్ది రోజుల్లోకి వచ్చింది. స్నేహితులతో సరదాలు, పార్టీలు క్షణం తీరికలేకుండా గడుపుతున్నాడు విష్ణు మళ్ళీ ఎంత కాలానికి కలు కుంటామో అని జోరు పెంచారు. స్నేహితులు, గర్ల్ ఫ్రెండ్స్‌తో ఎక్కువ సాన్నిహిత్యం ఏర్పడితే వచ్చే ప్రమాదం ఏమిటో అనుభవంలోకి వచ్చింది విష్ణుకు.

మేరీ వివాహం చేసుకో అంటూ తొందర చేయసాగింది. తల్లి కాబో తున్నానని, విష్ణు వివాహం చేసుకోకపోతే ఆత్మహత్యే శరణ్యం అని వెంటాడడం మొదలెట్టింది.

అప్పటికప్పుడు ఏదో మాట అడ్డంవేసి తప్పించుకో ప్రయత్నం చేస్తున్నాడు విష్ణు. కాని, మేరీని వదుల్చుకోవటం సామాన్యం కాదని తెలుసు.

విష్ణు విదేశాలకు వెళ్ళేరోజు దగ్గర పడింది. ముందు రోజు రాత్రంతా పార్టీ ఏర్పాటు చేశారు స్నేహితులు. ఆ ఒక్క రోజూ గడిపేస్తే మేరి బెడద వదలిపోతుంది. కాని, మేరీ పూరుకుంటుందా? ఆ రోజు సాయంత్రమే వెడ్డింగ్ ఎంగేజిమెంట్ ఏర్పాటు చేస్తున్నాననీ- బంధువులు, స్నేహితుల మధ్య ఉంగరాలు మార్చుకుని ఎంగేజిమెంట్ ప్రకటించాలని అడిగింది.

విష్ణుకు ఏమి పాలుపోలేదు. అసలు ఇంత దూరం వస్తుందనుకుంటే మేరీతో చనువుగా ఉండకపోయేవాడేమో! ఇప్పుడు తుమ్మబంకలా అంటుకో బోతున్న మేరీని వదిలించుకునేదెలా? పైగా ఈ గొడవతో స్నేహితులు ఏర్పాటు చేసిన పార్టీని కోల్పోవలసి వస్తుందేమో!

అప్పుడు పాత మార్గమే శరణ్యమైంది. ఆ ఒక్కరోజు క్ష్వీక్ ఫెయిర్ అండ్ లవ్‌లీ రాసుకుని మూలుగుతూ పడుకోమనీ, ఒక వేళ మేరీ వచ్చినా జ్వరంగా ఉందని చెపితే వెళ్ళిపోతుందనీ చెప్పి ఎలాగయినా తన పరువు కాపాడమని గడ్డం పుచ్చుకుని బతిమలాడాడు.

అన్న అడిగితే కాదనటం ఎప్పుడూ అలవాటు లేదు కృష్ణకు. కాకపోతే ఆడవాళ్ళతో మాట్లాడడానికి సంకోచపడే తను- విష్ణుగా మేరీని నమ్మించగలవా అని అనుమానం వచ్చింది.

ఏమీ మాట్లాడకుండా తలనొప్పి జ్వరం అని వణకుతూ ఉండమనీ, పెద్దగా మూలుగుతూ ఉంటే కాసేపు ఉండి మేరీ వెళ్ళిపోతుందని ధైర్యం చెప్పాడు విష్ణు.

కృష్ణ విష్ణు రూపంలోకి ప్రవేశించిన దగ్గరనుండి బెరుకు బెరుకుగా ఫీలవసాగాడు, ఎప్పుడు మేరీ వస్తుందో, ఎలా గొడవచేస్తుందో అనుకోసాగాడు.

ఒక్కసారిగా ఏదో నిస్సత్తువ వంట్లో ప్రవేశించినట్లు అనిపించి మత్తుగా ఉంది. ఎక్కడో చదివాడు - ఏవో బిళ్ళలు మ్రింగితే తాత్కాలికంగా మనిషిలో హుషారు వస్తుందని, మనిషిలో భయం, సంకోచం మాయం అవుతాయనీ;

మేరీని ఎదుర్కోవాలన్నా విష్ణుగా ప్రవర్తించగలగాలన్నా ఆ మాత్రలే శరణం అనుకుని నాలుగు అయిదు మిల్లీగ్రాముల బిళ్ళలు షాపునుండి తెచ్చుకుని మ్రింగాడు.

ఒక్కసారిగా మనిషిలో ఎంతో ఉత్సాహం ప్రవేశించినట్లు, చీకటిగా ఉన్న నగరం ఒక్కసారిగా విద్యుద్దీపాలు వెలిగి ప్రకాశవంతమయినట్లుగా అనిపించింది. ప్రాణం హాయిగానూ, హుషారుగానూ ఉంది. అంతవరకూ మేరీ వస్తే ఎలాగ అని భయపడిన కృష్ణ ఇప్పుడు మేరీ ఎప్పుడు వస్తుందా, ఎప్పుడు అటపట్టిద్దామా అని ఉత్కంఠంతో ఎదురుచూడసాగారు.

కొద్దిసేపటిలోనే తలుపుకొట్టిన శబ్దం వినిపించి, వెళ్ళి తీసిన కృష్ణకు ఎదురుగా మేరీ బదులు మంజు, ఆమె వెనుక అత్త జానకమ్మ, మామ రామస్వామి కనిపించారు. గబగబా లోపలికి వస్తూ, "నన్ను మహాబలిపురం తీసుకువెళతానని మర్చిపోయావు. ఈ పూట మనం అక్కడకు వెళ్దాం. మరల నువ్వు విదేశాల నుండి తిరిగివచ్చేటప్పటికి ఎన్నేళ్ళు పడుతుందో ఏమో" అంది మంజు

అవును, విష్ణు మళ్ళీ ఎన్నేళ్ళకొస్తావో, ఏమో? మన కారులో వెళ్ళి రండి" అన్నాడు మామ రామస్వామి.

తన సమాధానం కోసం చూడకుండా ప్రయాణ సన్నాహాలు చేయసాగారు. మధ్యలో అత్త జానకమ్మ- "కృష్ణ ఏడీ?" అని అడిగింది.

"కలకత్తా నుంచి ఎవరో పెయింటర్ వస్తే కలుసుకోవటానికి వెళ్ళాడు. అన్నాడు విష్ణు వేషంలో ఉన్న కృష్ణ, సాధ్యమైనంతవరకు అన్న గొంతును అనుకరిస్తూ. కొద్ది నిముషాల్లోనే అత్తమామ కూడబలుక్కున్నట్లు ఇంట్లోనే ఉండిపోయారు. సొంత కారులో బయలుదేరారు మంజు, కృష్ణ. దారి పొడుగునా మంజు మాట్లాడుతూనే ఉన్నది. విష్ణు మాట్లాడబోయినా పట్టించుకున్నట్లు లేదు. చీకటి పడకముందే మహాబలిపురం చేరారు. కారు హోటలు ముందు ఆపి కాలినడకన బయలుదేరారు బీచికి, శిథిల శిల్పాలు చూడటానికి, పంచ పాండవుల రథాలని ప్రసిద్ధిచెందిన కట్టడాల వద్దకు వచ్చేసరికి చీకటి పడింది. ఆ రోజు చతుర్దశి. కృష్ణలో సహజంగా ఉండే సంకోచం ఏమయిపోయిందో; మంజుతో సరిసమానంగా హుషారుగానూ, ఖుషీగానూ ఉన్నాడు.

ఏం చేస్తున్నారో ఇద్దరకూ తెలియలేదు. భావ కొంతకాలం దూరం అవుతాడనే ఆలోచనతో మంజు, చిరకాలంనుంచి హృదయాంతరాళాల్లో దాగిన ప్రేమకు మాత్రలు ఇచ్చిన హుషారులో కృష్ణ వళ్ళు మరచిపోయాడు. వళ్ళు తెలిశాక నెమ్మదిగానూ, భారంగానూ నడుస్తూ హోటల్ చేరుకున్నారు.

తప్పుచేశానన్న క్షోభతో కృష్ణ, స్త్రీకి ఆ సందర్భంలో సహజంగా వచ్చే సిగ్గుతో మంజు ఎంతో విశ్రబ్ధంగా కాలేక్కారు. త్వరలోనే కారు మద్రాసు చేరింది.

ఎవరయినా వచ్చారా అని అడిగితే, నాయర్ ఎవరూ రాలేదన్నాడు. మేరీ ఎందుకు రాలేదో అర్థంకాలేదు కృష్ణకు. బహుశ పెద్ద చేప పడిందేమో ఆమె వలలో;

ఎవరి గదిలోకి వారు చేరి పడుకున్నారు. అంతా నిద్రపోయారు కాని, కృష్ణ నిద్రపోలేదు.

తెల్లవారుజామున విష్ణు వచ్చాడు. తలుపుతీసి అత్త, మామ, మంజు వచ్చిన సంగతి, తాను మంజుతో మహాబలిపురం వెళ్ళి వచ్చిన సంగతి చెప్పి బాత్‌రూమ్‌కు వెళ్ళి మేకప్ కడిగేసుకు వచ్చాడు కృష్ణ.

తెల్లవారిన తర్వాత సిగ్గుతో కుంచించుకుపోయే మంజును ఎప్పటిలా వేళాకోళం చేస్తూ విష్ణు వింతగా చూశాడు. కృష్ణ గదినుండి బయటకు రాలేదు.

మధ్యాహ్నానికి తల్లీ, తండ్రి కూడా వచ్చారు. అంతా వెళ్ళి మీనంబాకం ఎయిర్‌పోర్టులో విష్ణుకు వీడ్కోలుఇచ్చి వచ్చారు. జర్మనీ చేరగానే టెలిగ్రాం ఇస్తానని చెప్పాడు విష్ణు.

ఉదయం లేవగానా జర్మనీ వెళ్ళే ఎయిర్ ఇండియా విమానం ఇటలీలో పర్వత ప్రాంతాలలో కూలిపోయిందనీ, అందరూ మరణించారనీ రేడియోలో వార్త విని అంతా కుప్పకూలిపోయారు.

కృష్ణ, మంజు సరేసరి

గిల్టీ ఫీలింగ్‌తో కృష్ణ, షాక్‌వల్ల మంజు ఏంతో ఉద్రేకానికి లోనయ్యారు.

దానికితోడు మంజు తల్లి జానకమ్మ పిచ్చిపిచ్చిగా ప్రవర్తించడం మొదలెట్టింది. అంతులేని విచారంవల్ల అలా ఉందేమో అనుకున్నారు కాని, డాక్టర్లు చూసి షాక్‌వల్ల ఆమె ఆరోగ్యం దెబ్బతిన్నదనీ, వీలున్నంత తొందరలో

మంజా వివాహం జరిపి ఉత్సాహవంతమయిన వాతావరణం ఏర్పడితే జరిగింది మరచిపోయి ఆమె కోలుకోవచ్చుననీ ఫామిలీ డాక్టరూ, సైక్రియాట్రిస్ట్ కలసి ఆలోచించి చెప్పారు.

విష్ణు లేడు కనుక మంజాను కృష్ణకు చేసుకోవడమే ఉచితం అని నిర్ణయించారందరూ. నిర్లిప్తంగా ఉన్న కృష్ణ, నిర్జీవంగా ఉన్న మంజా ఎదురు చెప్పలేదు. కృష్ణ, మంజాల వివాహం జరిగింది. క్రమంగా జానకమ్మ కోలుకుంది.

కాని కృష్ణ, మంజాల మధ్య దాంపత్య సంబంధం ఏమీలేదు. మంజా గజం దూరంలో ఉంటేనే కృష్ణకు అపరిమితమైన మనస్తాపం కలిగేది. కృష్ణ ఉన్న గదిలో ఉంటేనే గిల్టీగా ఫీలయేది మంజా.

ఇద్దరికీ వివాహమైనాక శరీర సంబంధం లేకపోయినా మహాబలిపురంలో వళ్ళు తెలియని స్థితిలో గడిపిన క్షణాల ఫలం మంజా గర్భంలో నిక్షిప్తమై పెరగటొచ్చి తొమ్మిది నెలల తర్వాత పండంటి మగబిడ్డ రూపంలో ఉద్భవించింది.

తాతలు, అమ్మమ్మా, నాయనమ్మా అమిత సంతోషంతో మనుమడికి విష్ణు అని పేరుపెట్టారు. అప్పటికీ ఇప్పటికీ కృష్ణ, మంజా పేరుకి భార్యాభర్తలు" అంటూ కథ ముగించాడు రాజన్.

వేడి కన్నీటిబొట్లు టపటపా రాలాయి రాజన్ కళ్ళనుంచి.

నా మనసులో ఏదో అనుమాన బీజం మొలకెత్తి శీఘ్రంగా పెరిగి పెద్దదవటం మొదలెట్టింది.

రాజన్‌ది కారు నలుపు. ఎడమచేతి ఉంగరపు వ్రేలికి ఉంగరం. అందులో కొట్టవస్తున్నట్లు కృష్ణవైడూర్యం.

యశోపాలగారి హాలులో గోడమీద రాజన్ వేసిన పెయింటింగ్ ఉంది.

నెమ్మదిగా వెళ్ళి పరీక్షగా చూశాను పెయింటింగ్ క్రింద ఇనీషియల్స్, రాజన్ కె వి అని ఉంది. అరవవాళ్ళలో అసలు పేరు ముందు అక్షరాలలోనూ, ప్రక్కనే తండ్రి పేరు వాడుకోవడం అలవాటు. రాజన్ కె. వి. అంటే రాజన్ కృష్ణవైడూర్యమా?

ఏదో అనబోయిన నన్ను యశోపాలగారు కంటి సైగతో హెచ్చరించారు.

అంతమందిలో మా ఇద్దరికే రాజన్ రహస్యం అర్థమయిందన్నమాట. ❋